- ఔర్ ఏక్ దక్కా.. కేసీఆర్ పక్కా

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే) లో శుక్రవారం బీఆర్ఎస్ 25వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ క్షేత్రంలో మళ్లీ వచ్చేది మన ఇంటి పార్టీ బీఆర్ఎస్, మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేది తెలంగాణ జాతిపిత కేసీఆర్ అని ఫ్లెక్సీలు పెట్టారు. పార్టీ జెండాలు పట్టి 'జై తెలంగాణ..జై కేసీఆర్..ఔర్ ఏక్ దక్కా కేసీఆర్ పక్కా..' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న నాయకత్వంలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీని అధికారంలో తీసుకొస్తామని అన్నారు. - ఇచ్చోడ

సంరంభం.. సన్నద్ధం

మొదటిపేజీ తరువాయి...

ఇప్పటికే నిగమ్మమయ్యారు. రజోత్సవ మహాసభ వేదిక, బహిరంగసభ, పార్కింగ్, ప్రజలకు అవసరమైన అన్ని వసతుల కల్పనకు వేగంగా ప్రణాళిక రూపొందింది. 60 ఏండ్ల ఆకాంక్షల ప్రతిరూపంగా 2001 ఏప్రిల్‌లో ఆవిర్భవించిన బీఆర్ఎస్ ఉద్యమంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది. 2014 నుంచి పదేండ్ల సుపరిపాలనతో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి దిక్సూచిగా నిలిపింది. 14 ఏండ్ల ఉద్యమం, 10 ఏండ్ల సుపరిపాలన మేళవింపుగా ఏప్రిల్ 27న ఎల్కతుర్తి వేదికగా 'బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ' జరుగుతున్నది. భారీ బహిరంగసభలు అంటేనే బీఆర్ఎస్ అని దేశ రాజకీయాల్లో ఒక నానుడి ఉన్నది. స్వరాష్ట్ర సాధన లక్ష్యంగా సాగిన ఉద్యమ వ్యూహంలో భాగంగా బీఆర్ఎస్ ఎన్నో భారీ బహిరంగ సభలను నిర్వహించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన భారీ బహిరంగసభలు ప్రపంచ రికార్డులను నమోదు చేశాయి. బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ సైతం అంతేస్థాయిలో ఉండేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఉన్న ఈ ఎల్కతుర్తిలోని 1,213 ఎకరాల్లో రజతోత్సవ మహాసభ సిద్ధమవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా 50 వేల వాహనాలు వస్తాయనే అంచనా ఉన్నది. దీనికి అనుగుణంగా 1,059 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. 154 ఎకరాల్లో రజతోత్సవ మహాసభ వేదిక సిద్ధమవుతున్నది.

రోడ్ల కూడలి.. ఎల్కతుర్తి

లక్షలాదిగా ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు, వేలాది వాహనాల రాకపోకలకు అనువుగా ఉండేలా వరంగల్ నగర సమీపంలో బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. దీనికి కొనసాగింపుగా వరంగల్ ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నేతలు అనువైన స్థలాలను పరిశీలించారు. తెలంగాణలోని అన్ని జిల్లాలకు రోడ్డుమార్గంలో అనుసంధానమయ్యే రెండు జాతీయ రహదారుల జంక్షన్ అయిన ఎల్కతుర్తి పట్టణాన్ని మహాసభకు అనువైన స్థలంగా గుర్తించారు. రెండు జాతీయ రహదారుల కూడలికి సరిగ్గా 300 మీటర్ల దూరంలోనే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ వేదిక ఏర్పాటు చేయనున్నారు. ఎల్కతుర్తిలో 1,200 ఎకరాలకు పైగా స్థలం ఉన్నది. విశాలమైన స్థలం, రవాణాపరంగా అనుకూలంగా ఉండటంతో బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు ఎల్కతుర్తి వేదిక అవుతున్నది.

లోటులేకుండా సదుపాయాల ఏర్పాట్లు

బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ అవసరాలకు అనుగుణంగా అన్నిరకాల వసతులు ఏర్పాటు చేస్తున్నారు. ఎండకాలం కావడంతో జనాలు ఇబ్బందులు పడకుండా బహిరంగసభ ప్రదేశంలో 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లను, మరో 10 లక్షల అర లీటరు నీళ్ల బాటిళ్లను సిద్ధంగా ఉంచనున్నారు. వారికి అన్నిరకాలుగా సహకారం అందించేందుకు 1,500 మంది వలంటీర్లను ని యమిస్తున్నారు. లక్షలాదిగా వచ్చే వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా ఉండేలా వలంటీర్లు సమన్వయం చేయనున్నారు. రిటైర్డ్ పోలీస్ అధికారులతో వీరికి శిక్షణ ఇప్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహిళలు, పురుషుల కోసం వేల సంఖ్యలో టాయిలెట్లను ఏర్పాటుచేసేలా ప్రణాళిక రూపొందించారు. అత్యవసర వైద్యసేవలను అందుబాటులో ఉంచనున్నారు. ఎల్కతుర్తికి వాహనాలు వచ్చే అ న్ని రహదారుల్లో అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, చిత్రంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఒడితెల సతీశ్‌కుమార్, తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, తదితరులు

మరో 25 ఏండ్ల ప్రణాళికకు అంకురార్పణ

- ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ: మాజీ ఎంపీ వినోద్
- ఇంటి పార్టీ బీఆర్ఎస్: దాస్యం

వరంగల్, మార్చి 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/హనుమకొండ: బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభలో వచ్చే 25 ఏండ్ల తెలంగాణ ప్రగతికి ప్రణాళికగా అంకురార్పణ జరుగుతుందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ వెల్లడించారు. కొత్త తరానికి కొత్త ఆలోచనలు కలిగించే వేదికగా ఈ బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఒడితల సతీశ్‌కుమార్, నన్నపునేని నరేందర్, శంకర్‌నాయక్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, కే వాసుదేవరెడ్డితో కలిసి ఆయన శుక్రవారం బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా 25 ఏండ్ల క్రితం బీఆర్ఎస్ పుట్టినప్పుడు.. మూణ్నాళ్లకే పోతుందని అప్పటి సీఎం చంద్రబాబునాయుడు, పీసీసీ అధ్యక్షుడు వైఎస్సార్ తదితరులు మాట్లాడారని చెప్పారు. సమైక్య పార్టీల విమర్శలు తప్పని రుజువు చేస్తూ బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి తీరిందని, కొత్త రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిందని స్పష్టంచేశారు. ఏప్రిల్ 27న ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ గొప్పగా నిలుస్తుందని చెప్పారు.

ప్రజల పార్టీ బీఆర్ఎస్ : దాస్యం

తెలంగాణ ప్రజల ఇంటిపార్టీ బీఆర్ఎస్ అని హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ తెలిపారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో లక్షలాది మందితో బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ ప్రాంత ప్రజల 60 ఏండ్ల కలను సాకారం చేసిన పార్టీ తమదేనని చెప్పారు. ఎల్కతుర్తి సభకు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఈ సభ గొప్ప మలుపు: ఎమ్మెల్సీ పోచంపల్లి

తెలంగాణ ప్రజల కోసం బీఆర్ఎస్ పార్టీ పుట్టిందని, వచ్చేనెలలో జరిగే పార్టీ రజతోత్సవ మహాసభ తెలంగాణలో రాజకీయంగా గొప్ప మలుపులకు కారణమవుతుందని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్‌కు వరంగల్‌తో సెంటిమెంట్ ఉన్నదని, ఇప్పుడు ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ 25 ఏండ్ల పండుగ జరగనున్నదని చెప్పారు.

స్వచ్ఛందంగా భూములిచ్చారు: పెద్ది

ఎల్కతుర్తి మండల కేంద్రంలో 1,213 ఎకరాల్లో సభ నిర్వహించేందుకు రైతులు స్వచ్ఛందగా తము భూములు ఇచ్చారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి చెప్పారు. భూములు ఇచ్చి సహకరించిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ 25 ఏండ్ల సభను ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిర్వహించాలని నిర్ణయించిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్కతుర్తి సభకు అవసరమైన అన్ని అనుమతులకు దరఖాస్తులు చేసినట్టు తెలిపారు.

గొప్ప నిర్ణయం: మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

బీఆర్ఎస్ 25 ఏండ్ల బహిరంగసభ ఎల్కతుర్తిలో నిర్వహించడం గొప్ప నిర్ణయమని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వీ సతీశ్‌కుమార్ తెలిపారు. బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేస్తామని ఆయన చెప్పారు.

దేవాదులను పూర్తిచేసింది బీఆర్ఎస్సే

- మంత్రులది అవగాహన రాహిత్యం
- పంటలను కాపాడలేని సర్కార్
- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య



హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): దేవాదుల ప్రాజెక్టును బీఆర్ఎస్ హయాంలోనే పూర్తిచేసినట్టు మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య స్పష్టంచేశారు. ఈ ప్రాజెక్ట్‌పై మంత్రులు అవగాహన లేకుండా ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పాత్రలేదని కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. 2005లో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అనేక ఆటంకాలు ఎదురయ్యాయని గుర్తుచేశారు. వీటన్నింటినీ అధిగమించి బీఆర్ఎస్ హయాంలో 2016 నుంచి 2024 వరకు 39 కిలోమీటర్ల టన్నెల్ నిర్మాణం పూర్తిచేసి, మోటర్లు బిగించినట్టు వివరించారు. కానీ మూడు మోటర్లు ఆన్ చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి 15 నెలలు పట్టిందా? అని ప్రశ్నించారు. ధర్మసాగర్‌కు 7.6 టీఎంసీల నీళ్లు మాత్రమే వచ్చాయని, 30 టీఎంసీలను ప్రభుత్వం వృథా చేసిందని ధ్వజమెత్తారు. రైతుల పంటపొలాలు ఎండుతుంటే కాపాడలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని మండిపడ్డారు. బురదలో రాయివేసి, బీఆర్ఎస్‌పై నెపంనెట్టి తప్పించుకోవాలని కాంగ్రెస్ సర్కార్ చూస్తున్నదని విమర్శించారు. ఆంధ్రా ప్రభుత్వం టెయిల్‌ఎండ్ నుంచి నీళ్లు తీసుకెళ్తుంటే నీటిపారుదల శాఖ మంత్రి పట్టించుకోవడమే లేదని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరిచి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలని డిమాండ్ చేశారు. పవిత్రమైన అసెంబ్లీలో కాంగ్రెస్ అబద్ధాలకు వేదికగా మార్చుకున్నదని విమర్శించారు. బడ్జెట్‌లోని వాస్తవ లెక్కలను బయటకు రాకుండా కప్పిపుచ్చిందని తెలిపారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

సీపీఎం నాయకుల డిమాండ్

రామగిరి/ ఇల్లెందు రూరల్/ బోనకల్లు, మార్చి 28 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం జిల్లా బోనకల్లు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. జిల్లా కమిటీ సభ్యుడు చింతలచెరువు కోటేశ్వరరావు మాట్లాడుతూ హామీల అమలుకోసం సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. అన్ని రకాల వడ్లను మద్దతు ధరకు కొనుగోలు చేసి వెంటనే బోనస్ చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఇల్లెందు మండలంలోని సీఎస్సీ బస్తీ రాజీవ్‌నగర్ కాలనీలోని గుడిసెవాసులకు తాగునీటి వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఇల్లెందు మండలం కోరగుట్టపై ఉన్న మిషన్ భగీరథ కార్యాలయాన్ని కాలనీవాసులు ముట్టడించారు. ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టారు.

ఇందిరమ్మ ఇచ్చిన భూములకు రేవంత్ వేలం!

- జీవ వైవిధ్యానికి కేంద్రంగా 'గ్రీన్‌లంగ్స్ ఆఫ్ హైదరాబాద్'
- 1973లోనే హెచ్‌సీయూకు 2300 ఎకరాల కేటాయింపు
- విద్య, సాంకేతిక రంగాలకు వినియోగించాలన్న ఇందిరాగాంధీ
- రికార్డుల్లో ఎక్కించని ప్రభుత్వం
- అదే సాకుతో 400 ఎకరాలను అమ్మేందుకు నిర్ణయం
- సీఎం రేవంత్ వ్యాఖ్యలపై భగ్గుమంటున్న విద్యార్థులు
- నేడు ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం
- హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ పిలుపు

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ... తెలంగాణ తొలి దశ ఉద్యమ ఉద్ధృతి తర్వాత నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఈ ప్రాంతానికి మేలు చేస్తున్నామని చెప్పుకునేందుకు ఏర్పాటుచేసిన విశ్వవిద్యాలయం. పార్లమెంటులో బిల్లు పెట్టి మరీ ఏర్పాటుచేసిన దేశంలోనే ఏకైక యూనివర్సిటీ ఇది. 1970 ప్రాంతంలో ఇక్కడ పర్యటించిన అప్పటి ప్రధా ని ఇందిరాగాంధీ కంచెగచ్చిబౌలిలోని 2,300 ఎకరాల విస్తీర్ణంలో ఈ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. జీవ వైవిధ్యానికి కేంద్రంగా ఉన్న ఈ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాలని కూడా సూచించారు. ఆమె ఈ ప్రాంతాన్ని 'గ్రీన్‌లంగ్స్ ఆఫ్ హైదరాబాద్' (హైదరాబాద్‌కు ఆక్సిజన్‌ను అందించే ప్రదేశం)గా అభివర్ణించారు. కానీ, ఇప్పుడు ఇదే ప్రాంతంలో ఏకంగా 400 ఎకరాల భూములను ఇందిరమ్మ వారసులుగా చెపుకుంటున్నవారే, అందునా ఇందిరమ్మ రా జ్యంలోనే అగ్రాజు పాడేందుకు సిద్ధమయ్యారు. ఇదేమంటే, అసలు ఆ ప్రాంతంలో జీవ వైవిధ్యమే లేదని బుకాయిస్తున్నారు. నాడు ఇందిరాగాంధీ చెప్పిన 'గ్రీన్‌లంగ్స్ ఆఫ్ హైదరాబాద్' నిజమా? ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్న కాంక్రీట్ జంగిల్ వాస్తవమా? క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఆశయాలను నెరవేర్చాల్సినవారే ఆ 'గ్రీన్‌లంగ్స్ ఆఫ్ హైదరాబాద్'ను కంటికి రెప్పలా కాపాడాల్సిందిపోయి, ఇలా తెగనమ్మడం ఎంతవరకు సమంజసం? నిజానికి, నాడు ఇందిరాగాంధీ చెప్పిన మాటలనే స్ఫూర్తిగా తీసుకొని, గ్రీన్‌లంగ్స్ ఆఫ్ హైదరాబాద్‌ను కాపాడుకునేందుకు యూనివర్సిటీ విద్యార్థులు కొంతకాలంగా పోరాడుతున్నారు. ఆ భూములను అ న్యాక్రాంతం చేయొద్దని ఉద్యమిస్తున్నారు. బా ధ్యతాయుతమైన ప్రభుత్వాలు జీవ వైవిధ్యాన్ని సంరక్షించాలని నినదిస్తున్నారు. పచ్చని ప్రకృతికి నిలయమైన భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి కాంక్రీట్ సిటీగా మార్చొద్దని, యూనివర్సిటీ భూముల వేలం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

1973లోనే 2,300 ఎకరాలు కేటాయింపు

హెచ్‌సీయూ పేరిట భూమి లేదంటూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిండు శాసనసభలో మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు హెచ్‌సీయూ చరిత్ర తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. 1973లో ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు రాజ్యాంగంలోని ఆర్టికల్ 371(డీ) (ఈ) ప్రకారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఏర్పాటుచేయాలని పార్లమెంట్ నిర్ణయం తీసుకున్నది. హైదరాబాద్ పరిసరాల్లో వెనుకబడిన ప్రాంత విద్యార్థులు విద్య, సాంకేతిక పరంగా అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో కంచెగచ్చిబౌలిలోని 2,300 ఎకరాల ప్రభుత్వ భూమిని యూనివర్సిటీకి కేటాయించారని గుర్తుచేశారు. యూనివర్సిటీకి కేటాయించిన భూములను నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కారు రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దానినే సాకుగా తీసుకుని ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం 400 ఎకరాలను అమ్మేందుకు సిద్ధమైందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కండ్లు తెరిచి యూనివర్సిటీ పరిధిలోని భూముల జోలికి రావొద్దని కోరుతున్నారు. వే లం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

గ్రీన్‌లంగ్స్ ఆఫ్ హైదరాబాద్

హెచ్‌సీయూ పరిధిలోని భూములను 'గ్రీన్‌లంగ్స్ ఆఫ్ హైదరాబాద్'గా అభివర్ణిస్తారు. నాడు యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్న సమయంలోనే ఇక్కడి జీవావరణం భవిష్యత్తులో హైదరాబాద్‌కు ఊపిరితిత్తుల్లా పని చేస్తుందని ఇందిరాగాంధీ, సరోజినీనాయుడు వంటి వారు వ్యాఖ్యానించారు. పెరుగుతున్న నగరీకరణ కారణంగా హైదరాబాద్ కాంక్రీట్ సిటీగా మారిపోతున్నది. కాలుష్యం పెరిగిపోతున్నది. ఇలాంటి సమయంలో విలువైన భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ప్రభుత్వం వేలం వేయాలని నిర్ణయించిన 400 ఎకరాల భూమి ఉన్నతమైన జీవావరణంతో కూడి ఉన్నది. అరుదైన జంతువులు, పక్షుల జాతులు ఈ ప్రాంతంలో ఉన్నాయి. మచ్చల జింకలు, నక్షత్రపు తాబేళ్లు, కుందేళ్లు, అడవి పందులు, అంతరించిపోయే దశలో ఉన్న పక్షులు ఇక్కడ ఉన్నాయి. నాగుపాములు, తాచుపాములు, కొండచిలువలు, రక్తపింజర జాతుల పాములు ఉన్నాయి. మరికొన్ని అరుదైన పక్షి జాతులు ఈ భూముల్లో నివసిస్తున్నాయి. జంతువులు, పక్షులతోపాటు వివిధ రకాల ఔషధ మొక్కలు కూడా ఉన్నాయి. అలాంజియం సల్పిఫోలియం (లో బీపీకి ఔషధం), ఆజార్డికా ఇండికా (కామెర్లు, చర్మ వ్యాధులకు ఔషధం), కెలొట్రోఫిస్ జైగాంన్షియా (యాంటీ బయాటిక్), కెతరాంథస్ రోసియస్ (లుకేమియా చికిత్స) తదితర జాతులకు నిలయంగా హెచ్‌సీయూ భూములున్నాయి.

నేడు కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం

కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ పిలుపునిచ్చింది. శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్‌సీయూ విద్యార్థులను గుంటనక్కలంటూ సంబోధించడాన్ని నిరసిస్తూ శనివారం యూనివర్సిటీ మెయిన్ గేట్ ముందు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయనున్నారు. సీఎం తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. 400 ఎకరాల భూముల వేలాన్ని వెంటనే ఆపేయాలని కోరారు. యూనివర్సిటీ పరిధిలోని భూములన్నింటినీ హెచ్‌సీయూ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు.

భూముల విక్రయం తెలివి తక్కువ నిర్ణయం

అసెంబ్లీలో సీఎం చెప్పిందంతా అబద్ధం

హెచ్‌సీయూ విద్యార్థులు, అధ్యాపకులు చెప్తున్న ప్రకారం అది జీవ వైవిధ్య ప్రాంతం

విధ్వంసాన్ని వెంటనే ఆపివేయాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరానికి ఆయువుపట్టు, ఊపిరి లాంటి ప్రాంతమైన గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని విక్రయించాలని అనుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ తెలివి తక్కువ నిర్ణయమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. ఆ భూమిలో ఎలాంటి జీవాలు లేవంటూ శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. సీఎం వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్ ఆ యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకుల నుంచి వివరాలు సేకరించారు. వారు చెప్పిన వివరాల ప్రకారం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ క్యాంపస్‌లో 700 రకాల పుష్పించే మొక్కలు ఉన్నాయని కేటీఆర్ తెలిపారు. ఆ ప్రాంతం 10 రకాల క్షీరదాలు, 15 రకాల సరీసృపాలు, 200 జాతులకు చెందిన పక్షులకు నిలయంగా ఉన్నదని వివరించారు. అంతే కాకుండా ఒక బిలియన్ సంవత్సరాల క్రితం నాటి రాతి నిర్మాణాలు అక్కడ ఉన్నాయని పేర్కొన్నారు. అత్యాధునిక భవనాలు, కొనుగోలు కేంద్రాలు నిర్మించేందుకు అభివృద్ధి చెందుతున్న సహజసిద్ధమైన ప్రాంతాన్ని నాశనం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అత్యంత బాధాకరమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విధ్వంసాన్ని వెంటనే ఆపాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు.

సిరిసిల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

సిరిసిల్లపై మరో కుట్ర!

- ప్యాక్స్ కొనుగోలు కేంద్రాలకు బ్రేక్
- ఎరువులు, విత్తనాల సేల్స్ బంద్
- 'వరి' సేకరించవద్దని ఆదేశాలు
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓ ఉన్నతాధికారి నిర్ణయం
- వేములవాడ నియోజకవర్గంలో కేంద్రాల కొనసాగింపు
- కేటీఆర్‌ను కలిసిన సింగిల్ విండో చైర్మన్లు

సిరిసిల్ల రూరల్, మార్చి 28 : రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓ ఉన్నతాధికారి నిర్ణయం వివాదాస్పదమైంది. వరి ధాన్యం కొనుగోలు విషయంలో మరోసారి కక్ష సాధింపు ధోరణి అవలంబించినట్లు తెలుస్తున్నది. సిరిసిల్ల నియోజకవర్గంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను మూసేసి, వేములవాడ నియోజకవర్గంలో మాత్రం కొనసాగిస్తుండడం విస్మయానికి గురిచేస్తున్నది. ఒకే జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో ద్వంద్వ నిర్ణయాలు తీసుకుంటూ సదరు అధికారి వార్తల్లో నిలుస్తుండడం గమనార్హం. సిరిసిల్ల నియోజకవర్గానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహించడంతో ఆయనపై ఆక్కసుతో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నట్టు ప్రచారం జరుగుతున్నది. సిరిసిల్ల నియోజకవర్గంలో సిరిసిల్ల, పెద్దూరు, నేరెళ్ల, ఎల్లారెడ్డిపేట, అల్మాస్‌పూర్, ముస్తాబాద్, పోత్గల్, గంభీరావుపేట, కొత్తపల్లి సింగిల్ విండోలు ఉన్నాయి. ఇవి దశాబ్దకాలంగా రైతులకు రుణాల మంజూరీ, ఎరువులు, విత్తనాలతోపాటు మార్కెట్ సదుపాయాలు, పరిశ్రమల ఏర్పాటుపై సేవలు అందిస్తున్నాయి. ఈ క్రమంలో జిల్లా అధికార యంత్రాంగం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను వరి కొనుగోలు ప్రక్రియ నుంచి మినహాయిస్తూ ..ఇందిరాక్రాంతి పథం–మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకుంది. దీంతో నిత్యం రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధి తగ్గించినట్టయింది.

సిరిసిల్ల నియోజకవర్గంలోనే నిలిపివేత

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎమ్మెల్యేగా ఉన్న సిరిసిల్ల నియోజకవర్గంలోనే సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలు ఎత్తివేయడంపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. సింగిల్ విండో పాలకవర్గాలను ఇటీవలే ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించిన విషయం తెలిసిందే. సిరిసిల్ల నియోజకవర్గంలో 10 సింగిల్‌విండోల్లో తొమ్మిది స్థానాల్లో బీఆర్ఎస్‌కు చెందిన చైర్మన్లు ఉండగా, కేటీఆర్, బీఆర్ఎస్‌పై కక్షపూరితంగానే నిర్ణయం తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇటీవలే సిరిసిల్ల కేంద్రంలో కేటీఆర్ పేరుపై ఫ్లెక్సీ ఉన్నందుకు అధికారులు టీస్టాల్ మూసివేయించిన విషయం రాష్ట్ర వ్యాప్తంగా చర్చ